68)రామక్రియ

ప॥ అయ్యో వారిభాగ్య మెంతెకాక। నెయ్యపువెన్న వట్టుక నెయ్యి వెదకేరు॥

చ॥ దేవుడు వెల్లవిరై దిక్కులెల్లా నిండుండగా। సోనల నాస్తికుడు శూన్యమై తోచు।
యీవల వాన గురిసి యేరెంతబంటి వారినా। కావరపుజీవునకు గతుగతుకే॥

చ॥ హరి శరణంటే గాచేఅట్టియుపాయమే వుండగ। విరసానకు గర్మమే వెగ్గళమాయ।
పరగ నరులకెల్లా బట్టపగలై యుండగా। అరయ గొన్నిజంతుల కంధకారమాయను॥

చ॥ యిక్కడ శ్రీవేంకటేశు డెదుటనే వుండగాను। అక్కటా మూఢున కెందు ననుమానమే।
మక్కువ నింతా నమృతమయమైన గోడికి। తెక్కుల దవ్వబొయ్యేది తిప్పపెంటలే॥